# జాతకాలు

**ఇంట్లోంచి** వీధిలోకి, వీధిలోంచి ఇంట్లోకి కాలుకాలిన పిల్లిలా తిరుగుతోంది వరలక్ష్మి.

ఉద్వేగంతో ఊగిపోతోందామె హృదయం. పరధ్యానం వల్ల ఆ రోజు అన్నీ అపసవ్యమైన పనులే జరుగుతున్నాయి. ఉడుకుతున్న పులుసులో ఉప్పుకు బదులు పంచదార వేసింది. పొంగుతున్న పాలలో నూనె చిలకరించి నాలుక కరచుకుంది. అలికిడైతే చాలు ఆమె అడుగులు వీధిగుమ్మం వైపు పడుతున్నాయి.

ఆమె మనస్సంద్రంలో ఇన్ని ఆటుపోట్లు చెలరేగడానికి కారణం మురళి ఏం చెబుతాడోనని. వద్దని ఎంత మొత్తుకున్నా వినకుండా కూతురికి జాతకం రాయించుకొస్తానంటూ సిద్ధాంతి వద్దకెళ్ళాడు.

ఆమె ఆందోళనకి కారణం తెలుసు కోవాలంటే ఆమె ఆలోచనలతో పాటే గతం లోకి వెళ్ళాల్సిందే.

★ ★ ★

జ్యోతిషరత్నాకర బిరుదాంకితుడైన జగన్నాథ శాస్త్రి లోగిలి ఎప్పుడూ సందర్శకులతో సందడిగా వుంటుంది. ఎందరో స్థానికేతరులు కూడా జాతకం చెప్పించుకోవడానికి ఆయనవద్దకు వస్తూ ఉంటారు. భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పడంలో ఆయన కడుదిట్ట. జనన సమయం, తిథి వార నక్షత్రాలు తెలియజేస్తూ జాతకం రాసి పంపమని సుదూర ప్రాంతాల నుండి మనియార్డర్లు వస్తుంటాయి. ఫలితంగా సిరిసంపదలకు లోటు లేదాయనకు.

శాస్త్రిగారికి ఇద్దరు మగపిల్లలు. అరవైఆరు కళలతో తర్వాత పుట్టింది వరలక్ష్మి.

బిడ్డ బారసాలకి ఎక్కడెక్కడినుండో వచ్చారు బంధుమిత్రులు.

విందు భోజనాలు చేసి ఎవరికి వారు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతుండగా కన్న కూతురి జాతకం రాసేందుకు గదిలోకెళ్లి తలుపు గడియ పెట్టుకున్నాడు జగన్నాథశాస్త్రి.

రెండు గంటల అనంతరం బయటకు వచ్చిన శాస్త్రి గారితో 'అమ్మాయి జాతకం ఎలా ఉంది?' అడిగారంతా.

'బాగానే ఉంది.' తుంచినట్టు సమాధానం ఇచ్చాడు శాస్త్రి.

మరి మాట్లాడలేదెవ్వరూ.

మరునాడు జగన్నాథశాస్త్రికి జ్వరం తగిలింది. జాతకం రాయించు కోవడానికి వచ్చిన వాళ్ళంతా ఉష్ణం అని తెలిసి వెళ్ళిపోయారు.

భర్త పరిస్థితికి బెంగ పడ్డది భ్రమరాంబ.

శాస్త్రి గారు మళ్లీ మామూలు మనిషవ్వడానికి రెండు నెలలు పట్టింది. ఇప్పుడు జాతకం కోసం ఆయన వద్దకొచ్చే వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఆదాయం తగ్గినా ఆస్తిపాస్తులు



6 A

ఉండటం వల్ల ఆర్థిక యిబ్బందులు లేవు. పైగా కుటుంబసభ్యుల మీద శ్రద్ధ చూపడానికి సమయం చిక్కుతోంది.

ముద్దుగా బొద్దుగా ఉండే వరలక్ష్మి ఒకరి ఒడిలోంచి మరొకరి ఒడిలోకి మారుతూ పెరిగి పెద్దదైంది.

'మన వరం యుక్త వయసుకొచ్చింది. ఏదైనా మంచి సంబంధం చూడండి' అంది భ్రమరాంబ.

'ఇప్పుడప్పుడే దానికి పెళ్ళేమిటి?' కసురుకున్నాడు జగన్నాథ శాస్త్రి.

నోరు నొక్కుకుంది భ్రమరాంబ.

మరో రెండు వసంతాలు దొర్లాయి.

మళ్లీ వరలక్ష్మి పెళ్ళి ప్రశక్తి తెచ్చింది భ్రమరాంబ.

'ఎన్ని సార్లు చెప్పాలి నీకు? నిండా పదహారేళ్ళు లేవు దానికి' భార్యమీద విరుచుకు పడ్డాడు జగన్నాథ శాస్త్రి.

అదికాదండీ. పిల్ల పైటవేసి నాలుగేళ్ళయింది. ఇంతకాలం ఆడపిల్లకి పెళ్ళి చేయక పోవడం మనయింటా వంటా లేదు. బంధువర్గం ముక్కుమీద వేలేసుకోక ముందే...'

కనుబొమ్మలు చిట్లించాడు కోపంగా జగన్నాథ శాస్త్రి.

భ్రమరాంబకు మరి మాట్లాడే అవకాశం చిక్కలేదు.

తండ్రి కోరిక మేరకు మధ్యలో ఆపేసిన చదువు కొనసాగిస్తోంది వరలక్ష్మి.

'కూతురిని అలా చదివించుకుంటూ పోవడమేనా లేక పెళ్ళిచేసే ఉద్దేశ్యం ఏమైనా ఉందా' అంటూ హితులూ, సన్నిహితులూ నిలదీసారు జగన్నాథ శాస్త్రిని.

బంధుజనం పెట్టే గడ్డి తినలేక వరలక్ష్మికి వివాహం చేయాలన్న నిర్ణయానికి వచ్చాడు శాస్త్రి.

శాస్త్రిగారు వరలక్ష్మికి ఎంత గొప్ప సంబంధం తీసుకువస్తారని అంతా గుడ్లప్పగించి చూస్తున్న తరుణంలో పిల్లను చూడటానికి రాజమండ్రి నుండి పెళ్ళి వారొచ్చారు.

పెళ్ళి చూపులయ్యాయి.

తాంబూలాలు పుచ్చుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు శాస్త్రి.

వరుడు రెండవ పెళ్ళివాడని తెలిసి అదిరిపడింది భ్రమరాంబ.

పుత్తడిబొమ్మలాంటి చెల్లెమ్మని రెండోపెళ్ళివాడికిచ్చి చేయడం మాకెంతమాత్రం ఇష్టం లేదన్నారు కొడుకులు.

ఎవరి మాట లెక్కచేయలేదు జగన్నాథ శాస్త్రి.

కన్న తండ్రే కసాయి వాడిలా ప్రవర్తిస్తూ ఉంటే ఎవరు మాత్రం ఏం చేయగలరు?

వరలక్ష్మి ఇల్లాలైంది. కూతురికి ఘనంగా సారె చీర పెట్టి మెట్టినింటికి సాగనంపాడు.

రెండు మూడు పర్యాయాలు భర్తతో రాజమహేంద్రవరం వెళ్ళి కూతురి కాపురం చూసొచ్చింది. భ్రమరాంబ. మన్మధ సామ్రాజ్యానికి మారుపేరుగా సాగిపోతున్న వారి ఆదర్శ దాంపత్యాన్ని చూసాక లక్ష్మిని రెండో పెళ్ళి వాడికిచ్చామన్న దిగులు పోయిందావిడకి.

వరలక్ష్మి నీళ్ళు పోసుకుందని తెలియగానే ఆమెను తీసుకు వచ్చి ఎంత వైభవంగా శ్రీమంతం జరిపించారు శాస్త్రి దంపతులు.

నెలలు నిండిన వరలక్ష్మి పండంటి మగబిడ్డను ప్రసవించి అందరి మనసులలో వసంతాన్ని చిలికించింది.

అంతలోనే ఆశనిపాతంలా విషజ్వరమొచ్చి అల్లుడు పోయాడన్న పిడుగులాంటి వార్త...

మూగపోయింది వరలక్ష్మి గళం.

కొయ్యబబారిపోయింది భ్రమరాంబ.

ముక్కుపచ్చలారని వయసులోనే వరలక్ష్మికి వైధవ్యం ప్రాప్తించినందుకు అంతా ఎంతో బాధపడ్డారు. కూతుర్ని రెండో పెళ్ళి వాడికిచ్చి దాని గొంతు కోసాడని జగన్నాథ శాస్త్రిని నిందించని వారులేరు.

ఎవరేమనుకుంటున్న మాట్లాడలేదు శాస్త్రి.

'అందరి రాతల్ని చదివి చెప్పే నీకు నా రాత తెలియకపోదు. నీ కళ్ళ వెంబడి నీళ్ళు ఎందుకు రావడంలేదో నాకిప్పుడర్థమైంది నాన్నా' నిష్టూరంగా పలికింది వరలక్ష్మి.

'ఔనమ్మా! మీ అందరికంటే ముందే నా గుండెల్లో తుపాను చెలరేగింది. కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహించింది. నా కళ్ళెప్పుడో ఇగిరిపోయాయి. ఇక ఎంతటి దుఃఖాన్నైనా దిగమింగుకునే శక్తి నా గుండెకుంది' అన్నాడు జగన్నాథ శాస్త్రి భర్త వియోగంతో కుమిలిపోతున్న కూతురితో.

'నా అయిదోతనం అర్థాంతరంగా ముగిసిపోతుందని తెలిసి కూడా నాకు పెళ్ళెందుకు చేసావు నాన్నా'

బిడ్డ చూపుల్ని భరించలేకపోయాడు జగన్నాథ శాస్త్రి.

'బాగా చెప్పావు తల్లీ. నేను నీకు పెళ్ళి చేసానా?...లేదు...మీరంతా నాచేత ఆ పని చేయించారు. పెళ్ళైన పదిమాసాల్లోనే నీకు వైదవ్యముందన్న విషయం నీ రేఖలలో కొట్టొచ్చినట్టు కనపడింది. అందుకేనమ్మా నీ పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాను. అందుకు మీ అమ్మేకాదు అంతా నన్ను అనరాని మాటలన్నారు. మన సమాజంలో ఆడపిల్లకు పెళ్ళి అనివార్యం. నీకు కళ్యాణం జరిపించకపోతే ఈ సంఘం నన్ను ఉరితీసినా పర్వాలేదనుకున్నాను. నిన్ను మూన్నాళ్ళ ముత్తైదువుగా చూడలేక కన్నెపిల్లగా మిగల్చలేక నాలో నేనెంత మధనపడ్డానో ఇక చెప్పి ఏం లాభం తల్లీ? నా తెలివితేటలతో నీ జాతకాన్ని తారుమారు చేయాలనుకున్నాను. భార్యపోయిన వ్యక్తితో నీ జీవితాన్ని ముడివేసాను. అప్పటికే ఒక కీడు జరగడం వల్ల అతడి ఆయుష్షు పెరుగుతుందని భావించాను. ఫలితంగా నీ సౌభాగ్యం నిలుస్తుందని భ్రమించాను. నా పిచ్చిగానీ

రాత గీత దాటుతుందా? అంటూ తన అంతరాంతరాల్లో నిక్షిప్తమైన వ్యధను వ్యక్తం చేసాడు జగన్నాథ శాస్త్రి.

'మాకా విషయం ముందే తెలిస్తే అమ్మాయి పెళ్ళి గురించి వత్తిడిచేసే వాళ్ళం కాదుకదా! మీరా సంగతి మనసులో పెట్టుకుని మగ్గిపోయే బదులు మా చెవిలో కూడా వేసుండవల్సింది' అంది భ్రమరాంబ.

'నీకు తెలీదు భ్రమరం రానున్న ఇక్కట్లను ముందుగా తెలుసుకోగలిగినవాడు రెట్టింపు బాధను అనుభవించవలసి వస్తుంది. మీరా నరకయాతన అనుభవించకూడదనే నిజాన్ని మరుగు పరిచాను. వ్యక్తి జీవితంలో మంచి చెడు రెండూ ఉంటాయి. మంచిని అందరూ ఆనందంగా ఆస్వాదిస్తారు. ఊహామాత్రంగానైనా చెడును భరించలేరు. ఇన్నాళ్ళు నేను అనుభవించిన క్షోభ పగవాడికి కూడా వద్దు అన్నాడు జగన్నాథ శాస్త్రి.

అంతవరకు అతని కళ్లల్లో కన్నీరు ఏ మూల దాగుందో జలపాతంలా జలజలా బయటకు తన్నుకొచ్చింది.

★ ★ ★

గతం కళ్ళముందు మెదిలే సరికి గజగజ వణికిపోయింది వరలక్ష్మి. మురళి ఇంకా రాలేదు. ఆమె ఆరాటం అంచులు దాటింది. తను అనుభవించిన కీడు మనవరాలికి వారసత్వం కాకూడదని దైవాన్ని ద్యానించింది.

"అమ్మా!" లోపలికి వచ్చాడు మురళి.

తనయుడి వంక దైన్యంగా చూసింది వరలక్ష్మి.

నిర్వీర్యంగా ఉన్నాయి ఆమె చూపులు. తన గుండె చప్పుళ్ళు ఎవరికీ వినిపించకుండా జాగ్రత్త పడుతోంది. "ఏమ్మా అలా ఉన్నావ్?"- ఆరుర్దాగా అడిగాడు మురళి.

'నా మాటకేం గాని ముందు సిద్దాంతిగారేమన్నారో చెప్పు'

'పాప జాతకం దివ్యంగా వుందన్నారు'

'హమ్మయ్య' తేలిగా ఊపిరి పీల్చుకుంది వరలక్ష్మి'

**(5 జూలై 1997 ఆంధ్రభూమి దైలి)**